ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 19 ఆగస్టు 2025



చోడవరం మండలంలోని అన్నవరం సమీపంలో నీట మునిగిన వరి పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మాడుగుల మండలంలోని తాడివలస గెడ్డను దాటుతున్న గిరిజనులు

జోరు వాన

జిల్లాలో విస్తారంగా వర్షాలు

నీట మునిగిన పొలాలు

- జలమయమైన రహదారులు
- జల దిగ్బంధంలో పలు గ్రామాలు

అనకాపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్):

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో సోమవారం జిల్లా వ్యాప్తంగా కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. పంట పొలాలు నీట మునిగాయి. రాబోయే 12 గంటల్లో ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

భారీ వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మండల కేంద్రాల్లోనే తహశీల్దార్లు అందుబాటులో ఉండి లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లతో మాట్లాడి వరద తీవ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు వెనకాడవద్దని అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి సంఘటనలు చోటుచేసుకున్నా జిల్లా అధికారులకు సమాచారం అందిస్తే మరిన్ని సహాయక బృందాలను పంపుతామని తెలిపారు. రావికమతం మండలం దొండపూడి వద్ద వరద నీటిలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. బుచ్చెయ్యపేట మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసిన వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. మాడుగుల మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది.

చోడవరంలో..

చోడవరం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. చాలాచోట్ల

... మిగతా 8వ పేజీలో

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లిలో 42.2, మునగపాక 30.2, కె.కోటపాడు 28.2, దేవరాపల్లి 27.8, సబ్బవరం 21.8, చీడికాడ 12.2, చోడవరం 17.4, బుచ్చెయ్యపేట 17.8, పరవాడ 16.6, రావికమతం 12.4, కశింకోట 12, నాతవరం 11.2, రోలుగుంట 10.4, నర్సీపట్నం 4.2, ఎలమంచిలి 3.8, అచ్యుతాపురం 1.8, గొలుగొండ 3.8, మాకవరపాలెం 4.6, కోటవురట్ల 7.2, ఎస్.రాయవరం 7.2, పాయకరావుపేట 3, రాంబిల్లిలో 3.8 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది.

పరవళ్లు తొక్కుతున్న నదులు

కళకళలాడుతున్న జలాశయాలు

అనకాపల్లి టౌన్/మాకవరపాలెం/నర్సీపట్నం/ఎలమంచిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని శారదా నది, సర్పానది, వరాహ నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న శారదానది పరవళ్లు తొక్కుతోంది. గత రెండు రోజులుగా జిల్లా అంతటా భారీ వర్షాలు కురవడంతో పాటు పెద్దేరు, కోనాం రిజర్వాయర్ల నుంచి గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో శారదానదిలో వరదనీటి ప్రవాహం భారీగా పెరిగింది.రెండు రోజుల క్రితం వరకు సాధారణంగా ఉన్న నీటి ప్రవాహం సోమవారానికి ఉధృతమైంది. మాకవరపాలెం మండలంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం వరకు కురుస్తున్న వర్షాలకు సర్పానది, వరహానదితో పాటు జాజిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గిడుతూరు, మల్లవరం, బయ్యవరం, పైడిపాల, మాకవరపాలెం గ్రామాల్లో పల్లపు పొలాల్లో వరినాట్లు పూర్తిగా నీట మునిగాయి. నర్సీపట్నం ఉత్తర వాహిని వద్ద వరహానది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెదబొడ్డేపల్లి, ధర్మసాగరం, నర్సీపట్నం పెద్ద చెరువు, దుగ్గాడ రామన్నచెరువులలో పొర్లుకట్టు నుంచి వరద ప్రవహిస్తున్నాయి. నర్సీపట్నం మండలం కృష్ణాపురం సమీపం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లిలో వరి పొలాల్లోకి వరద నీరు చేరింది. నర్సీపట్నం మండలంలో 26 ఎకరాలు వరద ప్రభావానికి గురైనట్టు అధికారులు గుర్తించారు. భారీ వర్షాలకు ఎలమంచిలి మండలంలో మైనర్ శారదా, వరహా నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది.



వంతెన కింద పరవళ్లు తొక్కుతున్న శారదానది



నర్సీపట్నంలో వరహానది ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

కూలిన పశువుల ఆస్పత్రి భవనం

బుచ్చెయ్యపేట: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం రాత్రి వడ్డాదిలోని పశువుల ఆస్పత్రి భవనం కూలిపోయింది. ఈ ఆస్పత్రి పెంకుటింట్లో శిథిలావస్థలో ఉండేది. సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వర్తించేవారు. అయితే మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు భవనం గోడలు నానిపోయి కూలిపోయింది. రాత్రి వేళ కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అదే పగటి వేళ అయితే సిబ్బంది ప్రమాదానికి గురయ్యేవారు.



వడ్డాదిలో కూలిన పశువుల ఆస్పత్రి భవనం


పెద్దేరు నుంచి నీరు విడుదల



పెద్దేరు నాల్గవ నంబర్ గేటు నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

మాడుగుల: మండలంలోని రావిపాలెం తెన్నేటి విశ్వనాథం జలాశయం (పెద్దేరు) నుంచి సోమవారం 500 క్యూసెక్కుల నీటిని నాల్గవ గేటు ద్వారా విడుదల చేశారు. భారీ వర్షాలకు రిజర్వాయర్ ఎగువ ప్రాంతాల నుంచి 770 క్యూసెక్కుల నీరు చేరింది. రిజర్వాయర్ సాధారణ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుత 135.90 మీటర్లకు చేరింది. దీంతో దిగువకు నీరు విడుదల చేశారు.

గరిష్ఠ స్థాయికి కోనాం నీటిమట్టం



కోనాం రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

చీడికాడ: కోనాం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, సోమవారం ఉదయం 10 గంటల సమయానికి 99.80 మీటర్లకు చేరింది. జలాశయం ఎగువన కురుస్తున్న వర్షానికి 850 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి వస్తుండగా, అదే స్థాయిలో మెయిన్, దిగువ గేట్లు ద్వారా ఉదయం 11 గంటలకు వరద నీటిని బొడ్డేరు నదిలోకి అధికారులు విడుదల చేశారు.

ఆర్‌ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

- '51 ఎంక్వయిరీ' ఆపాలని వినియోగదారుల పేరిట హైకోర్టులో పిటిషన్
- తప్పులు బయటపడతాయని భయం
- సర్వీసు నిబంధనలకు వ్యతిరేకం
- చర్యలు చేపట్టకుండా జిల్లా అధికారుల తాత్సారం
- ఆది నుంచి అదే తీరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (ఆర్‌ఈసీఎస్)లో కొందరు ఉద్యోగులు నిబంధనలను బేఖాతరు చేస్తూ చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా అడ్డగోలుగా ఉద్యోగంలో చేరి, అర్హతలు లేకుండా పదోన్నతులు పొంది లక్షల రూపాయల జీతం తీసుకుంటున్నవారు తమ తప్పులు బయట పడకుండా శతవిధాలా యత్నిస్తున్నారు.

ఆర్‌ఈసీఎస్‌లో భారీఎత్తున నిధుల దుర్వినియోగం జరిగిందని, అర్హత లేకుండా చాలామందికి ఉద్యోగాలు ఇచ్చారని ఫిర్యాదులు అందడం, వాటిపై విచారణ చేయాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) కూడా సూచించడంతో రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఈ ఏడాది మార్చి నెలలో 51 విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఉన్నతాధికారులు ఎవరితో విచారణ చేయాలో స్పష్టంగా ఆదేశాలు ఇవ్వకుండా ఆ బాధ్యత జిల్లా జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)కే వదిలేశారు. దాంతో విచారణాధికారిగా తుమ్మపాల షుగర్స్ ఎండీ ఎంవీఎస్ శాస్త్రిని అనకాపల్లి డీసీఓ ప్రేమస్వరూప నియమించారు. విచారణ జరిగితే మొత్తం తప్పులు బయట పడతాయని పాత రికార్డులు అందుబాటులో లేకుండా సిబ్బంది మాయం చేశారు. దాంతో విచారణ నెమ్మదిగా సాగుతోంది.

ఇదిలావుండగా ఆర్‌ఈసీఎస్ బాధ్యతలు చేపట్టిన ఈపీడీసీఎల్ అధికారులు ఇటీవల అక్కడి ఉద్యోగుల సర్వీసు రికార్డులు పరిశీలించారు. పదోన్నతులు పొందిన వారి అర్హతలను తనిఖీ చేశారు. సస్పెన్షన్‌లో ఉండగా పదోన్నతులు పొందారని, అదేవిధంగా పదోన్నతులు పొందడానికి నిర్ణీత సమయం ఉండగా, దానిని కూడా పాటించలేదనీ గుర్తించారు. ఆ విధంగా అధిక మొత్తాలు పొందుతున్న వారి జీతాలను జూలై నెల నుంచి తగ్గించేస్తూ

... మిగతా 8వ పేజీలో

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- పీఎస్ బోనంగిలో రూ.కోటిన్నర విలువ చేసే భూమి ఆక్రమణ
- ప్లాట్‌లుగా విభజించి షెడ్ల నిర్మాణం
- అధికార పార్టీకి చెందిన చోటా నాయకుడి దందా
- పట్టించుకోని అధికారులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వం మారినా ఆక్రమణలకు అడ్డుకట్ట పడడం లేదు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులు మిన్నకుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కులు చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారుతుందని అందరూ భావించారు. అయితే ఈ ప్రభుత్వంలో కూడా ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు.

పరవాడ మండలం పీఎస్ బోనంగి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 2/2 లో సుమారు 60 ఎకరాల ప్రభుత్వ కొండ పోరంబోకు భూమి ఉంది. గతంలో ఈ భూమిలో కొంత భాగాన్ని రైల్వే ట్రాక్ వేసేందుకు ఇవ్వగా, మరికొంత భూమిని పౌరసరఫరాల శాఖ గోదాములకు ప్రభుత్వం కేటాయించింది. ఇంకా సుమారు 20 ఎకరాల పైచిలుకు భూమి పౌరసరఫరాల శాఖ గోదాములకు సమీపంలో ఉంది. ఆయా భూముల్లో పీఎస్ బోనంగి గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్నారు. సరుగుడు, జీడి, యూకలిప్టస్ తోటలు వేశారు. ఆయా భూములపై తమకు హక్కు కల్పించాలని గ్రామానికి చెందిన రైతులు గతంలో అనేక పర్యాయాలు తహశీల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. కాగా గత కొద్ది రోజులుగా పీఎస్ బోనంగి సర్వే నంబరు 2/2లోని 2/5 సబ్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న సుమారు ఎకరాన్నర స్థలంలో అధికార పార్టీకి చెందిన కొందరు స్థానిక నేతల ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఒక చోటా నాయకుడి ఆధ్వర్యంలో కొందరు ఆ ప్రభుత్వ స్థలాన్ని తమ ఆధీనంలో పెట్టుకొని రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి వ్యాపారం చేస్తున్నారు. 150 గజాలు ఒక ప్లాట్ చొప్పున ఇంటి జాగాలుగా విభజించి రెండు వారాలుగా సదరు నాయకుడే దగ్గరుండి

... మిగతా 8వ పేజీలో



పరవాడ మండలం పీఎస్ బోనంగి గ్రామంలో ప్రభుత్వ భూమిలో షెడ్లు నిర్మిస్తున్న దృశ్యం

కృష్ణాష్టమి వేడుకల్లో అసభ్యకర నృత్యాలు

- పొట్టి దుస్తులతో యువతుల డ్యాన్సులు

ఎలమంచిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువతులు పొట్టి దుస్తులు వేసుకుని అసభ్యకర నృత్యాలు చేయడం కలకలం రేపింది. వారితో కొందరు యువకులు జత కలిసి డ్యాన్సులు చేశారు. సుమారు గంట సేపు ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన మహిళలు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై రూరల్ ఎస్‌ఐ ఉపేంద్రను సోమవారం వివరణ కోరగా డ్యాన్సులు జరుగుతున్నట్టు సమాచారం రావడంతో ఆ కార్యక్రమాన్ని నిలిపి వేయించామని తెలిపారు.



పొట్టి దుస్తులతో డ్యాన్స్ చేస్తున్న యువతి

లక్కీడ్రా ద్వారా బార్‌ల కేటాయింపు

- జిల్లాలో మూడు బార్లకు దరఖాస్తుల స్వీకరణ
- జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్

అనకాపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల కాలపరిమితితో జిల్లాలో నూతన బార్ పాలసీని అమలు చేయనున్నామని, ఇందులో భాగంగా జిల్లాలో నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో మూడు బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్ తెలిపారు. కొత్త బార్ పాలసీపై ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో ఆయన అనకాపల్లి కొప్పాకలోని జిల్లా కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం

... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న వి.సుధీర్

మైనర్ శారదా, వరహా నదుల పరవళ్లు



కోటవురట్ల మండలం గొట్టివాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది



అచ్యుతాపురం మండలం పూడిమడకలో నీట మునిగిన పూడిమడక ఉప్పు గల్లీలు



రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద ముంపునకు గురైన వరి పొలాలు

ఎలమంచిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో మైనర్ శారదా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరహా నది ఎగువ ప్రాంతంలో అధికంగా వర్షం కురవడంతో నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. మునిసిపాలిటీ సోమలింగపాలెం సమీపంలో మైనర్ శారదా నదిలో నీటి ప్రవాహం పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అలాగే తాగునీటికి ఢోకా ఉండదని సమీప గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కోటవురట్లలో..

అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సర్పా, వరహా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాలకు చెరువులు పుష్కలంగా సాగునీరు చేరింది. వర్షానికి పొలాల్లో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. ఆదివారం కురిసిన కుండపోత వర్షానికి వరహా, సర్పా నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. మండలంలో గెడ్డలు, వాగులు, పొంగి ప్రవహించడంతో చెరువుల్లోకి కొత్త నీరు పుష్కలంగా చేరింది. మండలంలో తాండవ, దుగ్గాడ కాలువల్లో పుష్కలంగా నీరు రావడంతో ఖరీఫ్ నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సోమవారం 6.6 మి.మీ వర్షపాతం నమోదైనట్టు తహశీల్దార్ తిరుమలబాబు తెలిపారు.

నీట మునిగిన పూడిమడక ఉప్పుగల్లీలు

అచ్యుతాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరాయంగా చినుకులు పడుతుండటంతో ఇంటి నుంచి బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. భారీ వర్షాలకు పూడిమడక తీరంలోని ఉప్పు గల్లీలు నీట మునిగాయి. ఇప్పటికే పండిన ఉప్పును గట్ల మీద కుప్పలుగా పోశారు. ఉప్పు కరిగిపోకుండా కొందరు టార్పాలిన్‌లు కుప్పలపై కప్పారు. అవకాశం లేక కొందరు ఉప్పురైతులు అలాగే వదిలేశారు. దీని వల్ల కొంత ఉప్పు వినియోగానికి పనికి రాదని రైతులు తెలిపారు. అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న గ్రౌండ్ పెద్ద చెరువులా మారింది. ఇక్కడ నుంచి నీరు వేరే చోటుకు వెళ్లే మార్గం లేకపోవడంతో నిల్వ ఉండిపోయి పెద్ద చెరువులా మారింది. కాగా అచ్యుతాపురం జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున పూడిమడకతో పాటు సెజ్ కర్మాగారాల నుంచి వచ్చే వాహనాలు మండల కాంప్లెక్స్ మీదుగా మళ్లించారు. భారీ సంఖ్య వాహనాలు రావడంతో రోడ్లు ఛిద్రమయి రాకపోకలను తీవ్ర ఇబ్బందిగా మారింది. సోమవారం సాయంత్రం నుంచి తెరిపిచ్చింది. వర్షాలకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పల్లపు ప్రాంతాలైన కొండకర్ల, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, ఎంజేపురం, తిమ్మరాజుపేట, హరిపాలెం, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, చీమలాపల్లి, ఆవసోమవరం, అందలాపల్లి తదతర ప్రాంతాల్లో రైతులు పొలం పనులకు సిద్ధపడ్డారు.

నక్కపల్లిలో..

నక్కపల్లిమండలంలో సోమవారం కొద్దిపాటి వర్షం మాత్రమే కురిసింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకూ మండలంలో 60.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ కేవలం 3.8 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. చిరుజల్లులు తప్ప పెద్ద వర్షం కురవలేదు. ఆకాశం మేఘావృతమై ఉంది.

మునగపాకలో..

స్థానిక మండల రెవిన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాలకు సాగునీటి కాలువల్లోకి నీరు చేరుతోందన్నారు. ఎటువంటి ముంపునకు తావులేకుండా ఆనకట్ట గేట్లు ఎత్తివేయించామని చెప్పారు. ఆదివారం ఉదయం 8 గంటలు నుంచి సోమవారం 8 గంటల మధ్య 91.4 మిల్లీమీటర్లు, ఆ తరువాత సాయంత్రం 6 వరకు 17.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయ్యిందన్నారు. ఎటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురైనా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సెల్ నంబర్ 8924257624 సంప్రదించాలన్నారు.

వరినాట్లుకు ఊపిరి పోసిన వర్షం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఇటీవల వేసిన వరి నాట్లకు ఊపిరి పోశాయి. మండలంలో పలు గ్రామాల్లో పది రోజుల క్రితం ఉడుపులు మొదలయ్యాయి. ఆ సమయంలో ఎండల అధికంగా ఉండడంతో వరినాట్లు వేసిన రైతులు ఆందోళనకు గురయ్యారు. మూడు రోజులుగా వర్షాలు కురవడంతో వేసిన వరి నాట్లు కళకళలాడడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

పాయకరావుపేట రూరల్‌లో..

అల్పపీడనం తీరం దాటే సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు మహేశ్వరరావు అన్నారు. సోమవారం ఎంపీడీవో జయప్రకాశరావుతో కలిసి ఆయన ఈదటం, పాల్మన్‌పేట, రాజయ్యపేట, వెంకటనగరం తదితర తీర ప్రాంత గ్రామాలను సందర్శించి, తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే.. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వీఆర్‌ఓలను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వెంకటనగరం గ్రామంలోని శిథిల తఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఈ భవనం కూలడానికి సిద్ధంగా ఉందని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంగా ఉందని సర్పంచ్ వంకా వెంకటరమణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వైవీ సత్యనారాయణ, వీఆర్‌వో, టీడీపీ నాయకుడు వంకా శివ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నదులు, కాలువలు, చెరువుల్లో పుష్కలంగా నీరు చేరింది. మండల పరిధిలో మేజర్, మైనర్ శారదా నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. గ్రామాల్లోని ప్రధాన రోడ్లు, వీధులు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లోని పంట పొలాలు వర్షం నీటితో నిండిపోయాయి. ఎండిపోయే స్థితికి చేరుకున్న వరి ఆకుమడులకు ఈ వర్షాలు ఊపిరినిచ్చాయి. కొబ్బరి, జీడి తోటలకు, అపరాలు పంటలకు, వరినాట్లు వేసుకొనేందుకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రధాన కొత్తూరు వద్ద మేజర్ శారదానది పాత వంతెనను ఆనుకొని ప్రవహిస్తుండగా.. నారాయణపురం వద్ద మేజర్ శారదానది రోడ్డు అంచును ఆనుకొని ప్రవహిస్తున్నది. అయితే మైనర్, మేజర్ శారదా నదుల గట్లు పలుచోట్ల బలహీనంగా ఉండడంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైవాడ జలాశయం నుంచి వరద నీరు వదిలితే రెండు నదులు మరింత జోరుగా ప్రవహిస్తాయని రైతులు చెబుతున్నారు. కాగా సాగునీరు పుష్కలంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొత్తూరు, నారాయణపురం వద్ద గల మేజర్, మైనర్ శారదా నదుల ఉధృతిని తహశీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రాజు పరిశీలించారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 64.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా.. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 7.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదయ్యిందన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని తహశీల్దార్ కోరారు.

నదుల ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే

అల్పపీడన ప్రభావంతో ఉధృతంగా ప్రవహిస్తున్న మండలంలోని కొత్తూరు, నారాయణపురం, గోకివాడ పరిధిలోని మేజర్, మైనర్ శారదా నదులను సోమవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు, కూటమి శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, దిమిలి సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి పొట్నూరి శివశంకర్, జనసేన నేతలు బద్ది మహేష్, నానేపల్లి సాయివరప్రసాద్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

వర్షాలకు మండలంలో వరహానది నిండుగా ప్రహహించడంతో పాటు పలు పంట కాలువల్లోని నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల నుంచి నీరు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో గల పొలాల్లోకి నీరు చేరడంతో దమ్ము పట్టి వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు.

ఎలమంచిలిలో..

వర్షాలకు నదీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉండే వారంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు ఎం. వరహాలు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కేఎస్. కొండలరావుతో కలిసి ఆయన జంపపాలెం, తురంగలపాలెం గ్రామాల్లో పర్యటించారు. జంపపాలెం గ్రామ సమీపంలో నదిలో నీటి ఉధృతిని పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులా మారిన అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ గ్రౌండ్



రాంబిల్లి మండల కొత్తూరు వద్ద పాత వంతెనపై నుంచి జోరుగా ప్రవహిస్తున్న మేజర్ శారదా నది



మేజర్ శారదా నది ఉధృతిని పరిశీలిస్తున్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కూటమి నాయకులు

108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం

నక్కపల్లి,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో శ్రావణమాసం బహుళ పక్షం దశమి పర్వదినం సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవశర్మ, ప్రణవ్ రామ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. తొలుత ఆలయంలో శ్రీరాముడు, ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణంతో కలిగే ప్రయోజనాల గురించి శ్రీపాద సత్యదేవ శర్మ వివరించారు. శని దోష నివారణకు హనుమాన్ చాలీసా పారాయణం, ఆరాధనతో ఎంతో ఉపశమనం కలుగుతుందని చెప్పారు.

గెడ్డం బుజ్జిని పరామర్శించిన హోం మంత్రి అనిత



గుంటపల్లిలో బుజ్జిని పరామర్శిస్తున్న అనిత

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం రాత్రి పరామర్శించారు. ఇటీవల గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్న బుజ్జిని గుంటపల్లి గ్రామంలో ఆయన స్వగృహంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ మండల అధ్యక్షుడు చింతలపు ప్రదీప్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, మల్లపురెడ్డి రమాకుమారి, సుంకర సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



వరినాట్లు వేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని మండల వ్యవసాయాధికారి శంకర్ గోవింద్ తెలిపారు. ఆది, సోమవారాల్లో పది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీనివల్ల వరినాట్లు వేసేందుకు అనుకూల పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మండలంలో 1500 ఎకరాల్లో వరి పండిస్తారని, ప్రస్తుత పరిస్థితులు వెయ్యి ఎకరాల్లో వరినాట్లు వేయడానికి అనుకూలంగా మారిందన్నారు. మండలంలో ఎంజేపురం, జగ్గన్నపేట, ఖాజీపాలెం, మల్లవరం, ఉప్పవరం, ఎర్రవరం, పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, ఆవసోమవరం, ఇరువాడ, ఆవరాజాం, తదితర పంచాయతీల పరిధిలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అలాగే 500 ఎకరాల్లో చెరకుకు ఈ వర్షాలు మేలు చేస్తాయన్నారు. ఈనెలాఖరుకు వరినాట్లు పూర్తవుతాయన్నారు.

కాకరాపల్లిలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ

మునగపాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాకరాపల్లి ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ దాత కర్రి నాగిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

గోమాలమ్మ తల్లి సంఘ అధ్యక్షుడిగా శ్రీను

మునగపాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మునగపాక గోమాలమ్మ తల్లి సంఘం అధ్యక్షుడిగా వెలగా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వల్లపువీధిలో ఉన్న సంఘం కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో కార్యదర్శిగా పెంటకోట పరశురాం, కోశాధికారిగా పిళ్లా జగదీష్, ఉపాధ్యక్షుడుగా వెలగా రామకృష్ణ ఎన్నికయ్యారు. వారితో పాటు డైరెక్టర్లుగా వెలగా శివరామజోగి, సీతారాం, దుర్గునాయుడు, జగదీష్ నియామకమయ్యారు.

శ్రీప్రకాష్ 49వ వ్యవస్థాపక దినోత్సవాలు ప్రారంభం

పాయకరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల 49వ వ్యవస్థాపక దినోత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాయకరావుపేట, తుని, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొనగా.. వీరికి గాతా రహే మేరా దిల్ పేరిట పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ఔత్సాహిక గాయకులను వెలికితీయాలన్న లక్ష్యంతో గాతా రహే మేరా దిల్ పేరిట ప్రతిఏటా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వీవీఎస్ఎస్.భానుమూర్తి, డాక్టర్ వీవీఎస్‌బీ.బంగార్రాజు, డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి,బి.సీతారాణి, మేనేజరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ

ఎస్.రాయవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి రామాలయంలో సోమవారం వినాయక, సరస్వతి దేవి పాలరాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఎస్.రాయవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డు తిమ్మాపురంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందు జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ మూడు రోజులు శ్రీకృష్ణుని ప్రతిమకు పూజలు చేశారు. చివరి రోజు సోమవారం శ్రీకృష్ణుని ప్రతిమను పల్లకిపై పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు బి. శాంతరాజు, శేఖర్ బాబు, సోమినాయుడు, జయరాం, సంతోష్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

ఎలమంచిలి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు రైతులు విధిగా జాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొక్కిరాపల్లి సేద్య విభాగ ప్రధాన శాస్త్రవేత్తలు డా.ఎంజీఎస్. కుమారి, శిరీష రైతులకు సూచించారు. సోమవారం ఎలమంచిలి సమీపంలోని కొత్తపాలెం రోడ్డు వద్ద శాస్త్రవేత్తల బృందంతోపాటు వ్యవసాయాధికారి మోహనరావు పొలాలను పరిశీలించారు. వర్షాలకు అధిక శాతం భూములు దమ్ములు పట్టడానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని నారుమడుల్లో నీరు అధికంగా చేరిందని, విధిగా సూచనలు పాటించాలన్నారు. నారుమడిలో అధికంగా చేరిన నీటిని తీసివేయాలని, నీటిని తీసిన తరువాత యూరియా 1 కేజి, మ్యురేట్ ఆఫ్ పోటాష్ ఒక కేజి, 5 సెంట్లు నారుమడికి వేసుకోవాలని సూచించారు. తెగుళ్లు ఆశించకుండా కార్బన్డిజం ఒక గ్రాము లేదా మ్యాన్కోజబ్ 3 గ్రాములు, లేదా పాఫ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు రైతు సేవాకేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం శ్రీరాంపురం రైతు సేవా కేంద్రంలోని యూరియాను రైతులకు వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యవరం, మంగవరం, ఎస్.నర్సాపురం, నామవరం, శ్రీరాంపురం, ఈదటం, తదితర గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో 70 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, జనసేన నాయకులు పిరుమళ్ళ మల్లికుమార్, బళ్ల బెనర్జీ, పిరుమళ్ల రమణ, గొర్ల అన్నవరం, వ్యవసాయ సిబ్బంది ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

రాజుకోడూరు ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ

రాంబిల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుకోడూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. రికార్డులలో నమోదు చేసిన వివరాల మేరకు గర్భిణులు, బాలింతలు, కౌమారదశ బాలికల వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించారు. రాజుకోడూరులో జిల్లా గణాంకాధికారి ఎ. రామచంద్రరావు ఇమ్యూనిజేషన్ స్పెషల్‌డ్రైవ్‌ను పరిశీలించారు. వర్షాల ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీవో కె.జగదీష్, డేటా మేనేజర్ వై. జనార్దన్, రాంబిల్లి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ రఘు, పీహెచ్ఎన్, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

▸▸ జనసేన పార్టీ నాయకుడు సతీష్‌కుమార్

మునగపాక, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని జనసేన పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ప్రతినిధి సుందరపు వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలో నాగులాపల్లి గ్రామంలో స్త్రీ, పురుషులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు కబడ్డీ పోటీలను ఇష్టంగా తిలకిస్తారన్నారు. మహిళా విభాగంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు మధ్య తొలి పోటీ జరిగింది. టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరికూటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో తొలిరోజు పోటీలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తిలకించారు.

వంద పడకల ఆస్పత్రిగా సీహెచ్‌సీ విస్తరణ

▸▸ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి.. ▸▸ హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని వంద పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని, ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సోమవారం నక్కపల్లి సీహెచ్‌సీలో పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి పరిధి ఎక్కువగా వున్న నక్కపల్లి ఆస్పత్రికి తరచూ రోడ్డు ప్రమాద బాధితులు వస్తున్నారని, అత్యవసర సమయంలో సీటీ స్కాన్ సహా మెరుగైన వైద్యసేవలు అవసరమని గుర్తించామన్నారు. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు.

ఆస్పత్రిలో అభివృద్ధి పనులు ప్రారంభం

నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్‌ను, సీ-ఆర్మ్ మెషీన్, ఆక్సిజన్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్‌లో మరికొన్ని వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం రోగులకు అందుతున్న సేవలు, ఇతర అంశాల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా హోం మంత్రి అనితకు వివరించారు. ఆస్పత్రి జనరల్ వార్డులో రోగులను హోం మంత్రి పరామర్శించారు. ఆమె వెంట కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, చించలపు పద్దు, అబద్దం, కొప్పిశెట్టి బుజ్జి, పెదిరెడ్డి చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి అనిత

కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

స్థానిక కేజీబీవీలో రూ. 41.6 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయ గదులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. కేజీబీవీ తరగతి గదుల్లోకి వెళ్లి బాలికలతో మాట్లాడారు. విద్యా బోధన, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు. కేజీబీవీ ప్రాంగణం, పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు ఎక్కువగా వున్నందున పాములు సంచరించే ప్రమాదం వుందని, పరిసరాలను పరిశుభ్రం చేయించాలని ఎంపీడీవో డీ సీతారామరాజును మంత్రి ఆదేశించారు. ఆమె వెంట రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఎంఈవో నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలిఅడుగు 90 శాతం పూర్తి'

అచ్యుతాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నియోజకవర్గంలో 90 శాతం పూర్తయిందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రముఖ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన నాయకులను గుర్తించి వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామన్నారు. ముందుగా మండల కమిటీలు పూర్తిచేసిన రెండు రోజుల్లో అనుబంధ కమిటీలను ఏర్పాటుచేస్తామన్నారు. పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కర్రి సాయి కృష్ణ, కొలుకులూరి విజయరామరాజు, ఆడారి మంజు, పీలా తులసీరామ్, లాలం భరత్, పెంటకోట విజయ్, ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు, గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, సేనాపతి నాగేశ్వరరావు, కాండ్రేగుల అప్పలనాయుడు, లాలం అభిరామ్ పాల్గొన్నారు.

వరి నారుమడులను పరిశీలించిన ఏడీఏ

రాంబిల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచదార్లలో వరినారుమడులను సోమవారం ఎలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జాహ్నవి పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వరిపంటకు అవసరమయ్యే యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువులను గ్రామ స్థాయిలో అంచనా వేసి పంపించామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం గ్రీవెన్స్‌ను ఈనెల 20వ తేదీ వరకు రైతుల నుంచి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, వీఏఏలు, వీహెచ్ఏలు,ఎంపీఓలు పాల్గొన్నారు.

'తాండవ వాలీ' వ్యాపార లక్ష్యం రూ.50 లక్షలు'

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాండవ వాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.50 లక్షల వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు సంఘం సీఈవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం సత్యవరంలో సంఘం అధ్యక్షుడు విశ్వనాధుని సత్యనారాయణ, అధ్యక్షతన సంఘం 3వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం గత ఏడాది రూ.35 లక్షల వ్యాపార లావాదేవీలు చేసిందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లపై రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. సంఘంలో ఉన్న ఎస్‌సీ రైతులకు స్ప్రేయర్లు, కట్టర్స్ టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు అధికారులు వెంకటరావు, వెంకటేశ్, సర్పంచ్ సఖిలేటి రాము, యగదాసు శేఖర్, టీడీపీ నాయకులు కీర్తి సీతారాం, జనసేన నాయకుడు యగదాసు నానాజీ, సంఘం కన్వీనరు వర్మ, డైరెక్టర్లు పి.కృష్ణ, పి. సూర్యనారాయణ, సభ్య రైతులు పాల్గొన్నారు.

బాలుడి శరీరంలోని పెన్సిల్ తొలగింపు

నక్కపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన ఒక బాలుడికి నక్కపల్లి ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవి కిరణ్ సకాలంలో శస్త్ర చికిత్స చేసి శరీరం నుంచి పెన్సిల్‌ను బయటకు తీశారు. రాజయ్యపేటకు చెందిన కార్తీక్ (12) అనే విద్యార్థి నక్కపల్లిలో ఒక ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. ఆరు రోజుల కిందట స్నేహితులతో ఆడుకుంటుండగా పెన్సిల్ తొడ వెనుకభాగంలోకి చొచ్చుకుపోయింది. ఆ బాలుడికి డాక్టర్ రవి కిరణ్ సకాలంలో ఆపరేషన్ చేసి, శరీరంలోకి పోయిన పెన్సిల్‌ను బయటకు తీసి కాపాడారు. సోమవారం రాష్ట్ర హోం మంత్రి అనిత నక్కపల్లి ఆస్పత్రిలో ఆ బాలుడిని పరామర్శించారు.


అనకాపల్లిలో భారీగా వర్షం కురుస్తున్న దృశ్యం


ఫూల్‌బాగ్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


తుమ్మపాల మెయిన్ రోడ్డులో...


పరవాడ మండలం కలపాక జగనన్న కాలనీలో...

ఎటు చూసినా జలమయం

- రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
- పొంగి పొర్లుతున్న వాగులు, చెరువులు
- పలు చోట్ల నీట మునిగిన వరి నాట్లు
- ఆందోళనలో అన్నదాతలు


సబ్బవరం మండలం గొల్లవానిపాలెంలో నీట మునిగిన వరి నాట్లు


పరవాడ మండలం లంకెలపాలెంలో...



కశింకోట మండలం వెదురుపర్తిలో నీటమునిగిన వరి పొలాలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం కూడా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అనకాపల్లిలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాటే వరకు వర్షం పడింది. 20.5 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్ర వేత్తలు తెలిపారు. ఈ కారణంగా పలు రహదారులు జలమయమయ్యాయి. ఫూల్‌బాగ్ రోడ్డు, భీమునిగుమ్మం, ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. కొబ్బరి, అరటికాయల మార్కెట్, కూరగాయల మార్కెట్ కారణంగా చిత్తడి చిత్తడిగా మారాయి.

తుమ్మపాల : ఎడతెరిపి లేకుండా సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షాలకు ఈ ప్రాంతం జలమయమైంది. ఎటుచూసినీ నీరే కనిపిస్తోంది. తుమ్మపాల నుంచి దిబ్బపాలెం, వెంకుపాలెం గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. బవులవాడ మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న పంట కాలువ నిండిపోవడంతో మెయిన్ రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం సాగింది. దీంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో రహదారులు చిత్తడిగా మారాయి.

కశింకోట మండలంలో...

కశింకోట : మండలంలో గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపి లేని వర్షానికి లోతట్టు ప్రాం తాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. చాలా చోట్ల వరి తదితర పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. గ్రామీణ ప్రాంతాల రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమాదులపాలెం, పరవాడపాలెం, అచ్చెర్ల, తాళ్లపాలెం, చెరకాం, కన్నూరుపాలెం తదితర గ్రామాల్లో వరి పంటపొలాలు పూర్తిగా నీటమునగడంతో ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. నీరు బయటకు పంపే మార్గం లేకపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ/లంకెలపాలెం: అల్పపీడనం కారణంగా సోమవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో వర్షపునీరు పొలాల్లోకి చేరింది. పలు ప్రధాన రహదారుల పైనుంచి పారింది. పరవాడ పెద్ద చెరువు, పైడమ్మ బంద చెరువు నీటితో కళకళలాడుతున్నాయి. ఎడ తెరిపిలేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మత్స్యకార గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరంలో ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులంతా వేటకు విరామం ప్రకటించారు. ఇదిలావుంటే, తహసీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో బి.రమేష్‌నాయుడు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో కలిసి జాలారిపేట, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాన్ రక్షిత కేంద్రాలను సందర్శించారు. ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్రాలను పరిశుభ్రంగా తయారు చేశారు. మత్స్యకారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : భారీ వర్షాలకు మండలంలోని సాగు నీటి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వంగలి, ఆదిరెడ్డిపాలెం, గొర్లివానిపాలెం, సబ్బవరం, మొగలిపురం, మలునాయుడుపాలెం తదితర గ్రామాలోని సాగు నీటి చెరువుల్లో భారీగా నీరు చేరింది. దీంతో పలుచోట్ల దిగువకు ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో రైతులు వేసిన వరి నాట్లు నీట మునిగాయి. పంట ఆదిలోనే ఇలా ఉంటే ముందు పరిస్థితి ఏమిటని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి నాట్లు మునిగిన ప్రాంతాల్లో నీటిని దిగువకు పోయేలా ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ సూచించారు. పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు సూచించారు. వాగులు, చెరువులు ఉన్న చోటకు మేతకు విడిచిపెట్టరాదన్నారు. పశువులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే సమీపంలోని పశువైద్య కేంద్రాలకు తగిన సమాచారం అందించాలన్నారు.


కొత్తూరులోని దేవీనగర్‌లో పర్యటిస్తున్న డీపీవో సందీప్

ముంపు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి : డీపీవో

కొత్తూరు: ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఈ.సందీప్ సూచించారు. అనకాపల్లి మండలంలోని కొత్తూరు, సత్యనారాయణపురం పంచాయతీల్లో పలు ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. శారదా నది ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు వదిలేటప్పుడు దిగువ ప్రాంతాలకు ఉధృతంగా ప్రవహించే అవకాశముందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలంతా మరింత అప్రమత్తంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీతానగరం, వెంకుపాలెం శారదానది పరీవాహక ప్రాంతాల్లో నివాస గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలు సురక్షితంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తకు ముందే మంచినీటి ట్యాంకుల్లో నీరు నింపుకోవాలన్నారు. అనంతరం దేవీనగర్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ వర్షపునీరు నిలిచిపోవడంతో పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, కార్యదర్శులు సుభాష్, చింతల శ్రీనివాసరావు, గ్రామ నాయకుడు సప్పారపు వరహాలబాబు తదితరులున్నారు.

కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పణ


అమ్మవారికి సమర్పించేందుకు పసుపు కుంకుమ తీసుకువెళ్లిన ఆలయ నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయ నిర్వాహకులు విజయవాడ కనకదుర్గమ్మకు ఆదివారం పసుపు కుంకుమలను సమర్పించారు. దసరా పండుగ ముందు ఏటా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన అమ్మకు, అనకాపల్లి నూకాంబిక అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పిస్తుంటారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఆలయ చైర్మన్ భీమరశెట్టి వరహాలు, కార్యవర్గసభ్యులు, గౌరీ పరమేశ్వరి, మరిడిమాంబ అమ్మవారి ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత


జనసేన కార్యాలయంలో మంజూరు పత్రం అందిస్తున్న రాంకీ

కొత్తూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి రింగు రోడ్డులోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) సోమవారం 12 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, నందారపు సూరిబాబు, మామిడిపాలెం సర్పంచ్ పూడి పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో క్వారీ లారీ బీభత్సం


తుమ్మపాల జంక్షన్ వద్ద డివైడర్‌పైకి దూసుకు వచ్చిన లారీ

తుమ్మపాల, ఆగస్టు 18 (ఆం ధ్రజ్యోతి) : రాళ్ల లోడుతో వెళుతున్న క్వారీ లారీ ఆదివారం రాత్రి తుమ్మపాలలో బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. అన కాపల్లి మండలం మార్టూరు గ్రామంలో గల క్వారీ నుంచి పరి మితికి మించిన బండరాళ్ల లోడుతో ఓ లారీ అచ్యుతాపురం వైపు వేగంగా వెళుతోంది. తుమ్మపాల జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. డ్రైవర్ మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపడం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, ఉంటే పరిస్థితి ఏం కావాలని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి లారీలపై ఇప్పటికైనా పోలీసులు, అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గొలుసు కట్టు చెరువులు కాపాడుకోండి

- పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గొలుసుకట్టు చెరువులను కాపాడుకోవాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధచూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆమె కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. కాలువల్లో పూడికతీత, దోమల లార్వా మందు నివారణ పిచికారీ చేయాలన్నారు. తుప్పల తొలగింపుతో సహా బావులు, కుళాయిలు, బోర్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చేపట్టాల్సిన పనులను వివరించారు. గొలుసుకట్టు చెరువులు దెబ్బతింటే నీరు వృథా అవుతుందని, వీటి నిర్మాణాలు పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఆస్తి పన్ను వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. జల్ జీవన్ మిషన్‌లో కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జిల్లా పంచాయతీ అధికారి సందీప్, డిప్యూటీ సీఈవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజులావాణి, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, ఈవోపీఆర్డీ నాగలక్ష్మి, హార్టికల్చర్ అధికారి ఎంఏ రహీం తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యాలయం సందర్శన

పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. డయాలసిస్, గర్భిణుల, ఔట్ పేషంట్ల విభాగాలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలందించాలని వైద్యాధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ఎదుట నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పీలా జన్మదిన వేడుకలు

- హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు హాజరు


నూకాంబికను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పీలా

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలు సోమవారం ఇక్కడి రింగు రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్‌లు విచ్చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వీరి సమక్షంలో పీలా గోవింద జన్మదిన కేకుకట్ చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత ఆయన నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, కేకే వీఏ నారాయణరావు, కర్రి బాబి, ఎస్కే బాబర్, కలగా సోమేశ్వరరావు, వేగి తారకేశ్వరరావు, తాకాశి కృష్ణ, మేడిశెట్టి నాగ రామఅప్పారావు, కరణం శ్రీనివాసరావు, నారపిన్ని చంద్రశేఖర్, దండుపాటి గంగరాజు, కరణం శ్రీనివాసరావు, ఎం.నూకరాజు, బత్తుల రమేష్, పెంటకోట రాము, ఉగ్గిన రమణమూర్తి, మళ్ల నిరంజన్‌కుమార్, అందే సన్యాసిరావులతో పాటు నియోజకవర్గంలోని కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పీలాను గజమాలతో సత్కరిస్తున్న మంత్రి అనిత

రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- దుర్గమాంబ పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో గండి బాబ్జీ


కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ అన్నారు. దుర్గమాంబ పీఏసీఎస్‌కు నూతనంగా నియమితులైన పర్సన్ ఇన్‌చార్జి గండి దేముడు, పర్సన్‌లు పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావు ప్రమాణ స్వీకారం సోమవారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు హాజరైన ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. పారదర్శకంగా రుణాలు ఇస్తూ రైతులకు మెరుగైన సేవలందించాలని నూతన కార్యవర్గాన్ని కోరారు. పార్టీలో సీనియర్లందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కొత్త పర్సన్ ఇన్‌చార్జి గండి దేముడు మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే సొసైటీ అభివృద్ధి చెందిందని, దీనిని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాల నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పీవీఎస్ శాస్త్రి, సీఈవో గొంప రమణ, శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు, నాయకులు గొర్లి రామునాయుడు, గండి దేముడు, గండి వంశీదీప్, బాబూరావు, బొండా సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠ


పంచలోహ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం కన్యకాపరమేశ్వరి, జనార్దనస్వామి, నగరేశ్వరస్వామివార్ల పంచలోహ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ముందుగా ఉత్సవమూర్తులకు సంప్రోక్షణ నిర్వహించారు. విశేష పూజల అనంతరం ప్రతిష్ఠా మహోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జడ్సీ విస్తృత పర్యటన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి సోమవారం విస్తృతంగా పర్యటించారు. వర్షాలు పడుతుండడంతో గవరపాలెం ప్రాంతంలో పరిస్థితులను తెలుసుకున్నారు. అంబేడ్కర్‌నగర్, కర్రివారివీధి ప్రాంతాల్లోని కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో ఎక్సకవేటర్ సహాయంతో దగ్గరుండి తొలగించజేశారు. జాతీయ రహదారి నూకాంబిక ఆలయ ముఖద్వారం రోడ్డులో వర్షపునీరు నిలిచిపోవడంతో నీటిని తోడించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు ఎటువంటి ఫిర్యాదులు చేయాలన్నా, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నా 99592 25595 నంబరుకు తెలియజేయాలని కోరారు.

బిర్యానీ పాయింట్ యజమాని అదృశ్యంపై కేసు

కశింకోట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోటకు చెందిన బిర్యానీ పాయింట్ యజమాని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి సోమవారం ఆయన తెలిపిన వివరాలివి. కశింకోట జాతీయ రహదారిని ఆనుకొని షేక్ సాజిద్ బిర్యానీ పాయింట్ నడుపుతున్నాడు. పదేళ్ల క్రితం హైదరాబాద్ నుంచి భార్య షేక్ షాహీన్‌తో కలిసి వచ్చి ఇక్కడ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం బిర్యానీ తయారీకి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసేందుకు స్కూటీపై బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య షామిన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ బోడన్నపడాల్

హక్కులపై అవగాహన అవసరం

▸ సుప్రీం కోర్టు న్యాయవాది వై.బాబ్జీ

చింతపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేధోసంపత్తి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సుప్రీం కోర్టు న్యాయవాది వై.బాబ్జీ స్పష్టం చేశారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి అధ్యక్షతన సోమవారం జరిగిన జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ పేటెంట్లు, కాపీ రైట్స్, ట్రేడ్ మార్క్, వాణిజ్య రహస్యాలు, ఆధునిక భావన చట్టపరమైన వ్యవస్థలో హక్కుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ బోడయ్యపడాల్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థులు విజ్ఞాన్ని పెంపొందించుకుని మేధో సంపత్తిని సాధించాలని సూచించారు. అనంతరం కోఫోకాన్ కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాదిగుమ్మి జలపాతం ఉరకలు



వరద నీటితో ఉరకలు వేస్తున్న గాదిగుమ్మి జలపాతం

కొయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కినపర్తి పంచాయతీ వలసంపేట సమీపంలో గాదిగుమ్మి జలపాతం వరద నీటితో ఉరకలు వేస్తున్నది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చూపరులను జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఎత్తయిన పెద్ద రాయిపై నుంచి జారువారుతున్న ఈ జలపాతం చూడాలంటే కృష్ణాదేవీపేట నుంచి శరభన్నపాలెం వెళ్లే మార్గంలో వలసంపేట వద్దకు వెళ్లాలి. అక్కడి నుంచి గిరిజా సమేత తాండవేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి, ప్రధాన రహదారి నుంచి కిలోమీటరు ప్రయాణిస్తే ఈ సుందర జలపాతానికి చేరుకోవచ్చు. అయితే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదించాలని అధికారులు సూచించారు.

చింతపల్లిలో గుర్తు తెలియని బాలుడు



స్టేషన్‌లో ఉన్న బాలుడు

చింతపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో గుర్తు తెలియని బాలుడు ఉన్నట్టు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలి పారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సంచరిస్తున్న బాలుడ్ని స్థానికులు పోలీసు స్టేషన్‌కి తీసుకుని వచ్చారని చెప్పారు. బాలుడు వివరాలు చెప్పడంలేదని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్ సంప్రదించాలని సూచించారు.

భారీ వర్షం.. జన జీవనానికి అంతరాయం

కొయ్యూరును కుదిపేసిన వాన.. పొంగుతున్న వాగులు, గెడ్డలు

బాహ్య ప్రపంచంతో పలు గ్రామాలకు తెగిన సంబంధాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు కొయ్యూరు మండలం అతలాకుతలమైంది. శనివారం రాత్రి నుంచి సోమవారం వరకు పడిన వానకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. చాలా చోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. ప్రధాన రహదారులు కోతకు గురయ్యాయి. పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఫలితంగా గిరిజనులు, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



పాడి ప్రధాన రహదారితో శిథిలమైన వంతెన... వేమనపాలెం వద్ద కొండవాగును తాడు సాయంతో దాటుతున్న గిరిజనుడు

కొయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా భారీ వర్షాలకు కొండ వాగు ప్రవాహాలు పొంగి ప్రవహించటంతో పలు గ్రామాలకు బాహ్య ప్రపపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గ్రామాలకే పరిమితమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా యు.చీడిపాలెం, మఠంభీమవరం, కొండ గోకిరి, నడింపాలెం పంచాయతీలలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. అడ్డతీగల మండలం వేట్లపాలెం నుంచి యు.చీడిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో గొట్లపాడు దాటాక ఉన్న బండిగెడ్డ పొంగి పోవటంతో యు.చీడిపాలెంకు రాకపోకలు నిలిచాయి. అలాగే ఇదే రహదారి మీదుగా ఉల్లిగుంట, కామమామిడి, దొరచింత తదితర గ్రామాలకు రవాణా నిలిచిపోవటంతో పాటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. తీగలమెట్ట సమీపంలో కొండవాగు పొంగి ప్రవహిస్తుండడంతో సుమారు మూడు గ్రామాలకు పరిస్థితి ఇలానే తయారైంది. పలకజీడి, సమీప వేమనపాలెం, ఈదులబందల వద్ద బండిగెడ్డ ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఈదులబంద, సంగంవలస, నక్కలమెట్ట, రేవులకోట, దబ్బలంక, తోటచిలుక, బిల్లుపాలెం, పుట్టకోట, పీఎల్ కొత్తూరుతో పాటు గొల్లబంద, నీలవరం, పాలసముద్రం, ఎర్రగొండ మర్రిపాకలు, నక్కలమెట్ట జెర్రిగొంది, బంగారుబంద, ఆయా గ్రామాల ప్రజలు గత రెండు రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. సరికదా ఈ గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంలోకి రావాలంటే వాగులు దాటాలి. ఈ వాగులపై వంతెనలు నిర్మిస్తామన్న గత ప్రభుత్వ పాలకుల హామీలు అమలు కాకపోవటంతో దీంతో రెండు రోజులుగా గ్రామాలకే పరిమితమై గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు తాడు ఆదారంగా సాహసించి మరీ వాగులు దాటుతున్నారు. వై.రామవరం నుంచి మఠంభీమవరం వెళ్ళే రహదారి పూర్తిగా శిథిమైంది. పలుచోట్ల వరినారుమడులు నీటమునగగా రైతులు వర్షంలో తడుస్తూ నారుమడులు పరిక్షించుకునే చర్యలు చేడుతున్నారు. గోకిరి పంచాయతీ పాడి వెళ్లే ప్రధాన రహదారిలో కొండ వాగుపై నిర్మించిన వంతెన గడిచిన నాలుగు సంవత్సరాల క్రితమే ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. అలాగే కొయ్యూరు-రేవళ్లు మీదుగా దాకోడు వెళ్లే ప్రధాన రహదారిలోని నిమ్మలపాలెం సమీపంలో భారీ చింత చెట్టు నేలకొరిగింది.

మాధవ్ పర్యటన విజయవంతం చేయాలి

▸ బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్

గూడెంకొత్తవీధి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పాడేరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 21న పర్యటించనున్నారని, కార్యక్రమాన్ని నాయకులు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాధవ్ తొలిసారిగా గిరిజన ప్రాంతానికి వస్తున్నార న్నారు. ఆదివాసీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకొని వెళ్లి ఆయన పరిష్కరించేందుకు ఈ పర్యటన నిర్వహిస్తున్నారన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, బీజేపీ నాయకులు పండ ఈశ్వరరావు, బొండ్ల చిరంజీవి, రామ్‌కిరణ్ కుమార్, ఆర్.పాల్, లక్ష్మణరావు, బి.వెంకట్, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

▸ సీపీఐ సీనియర్ నాయకుడు విష్ణుమూర్తి

సీలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని సీపీఐ సీనియర్ నేత సుంకరి విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, గిరిజనులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధారకొండ, సీలేరు, అమ్మవారిధారకొండ, దుప్పిలివాడ, గాలికొండ పంచాయతీలు మండల కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. ధారకొండను మండల కేంద్రంగా చేస్తే స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. కాంగ్రెస్ నేత కారే శ్రీనువాసు, నాయకులు దుర్గో, మార్కురాజు, ధర్మరాజు, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు పునరుద్ధరణ

చింతపల్లి-నర్సీపట్నం మార్గంలో యథావిధిగా నడుస్తున్న వాహనాలు



అప్రోచ్ రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు

చింతపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాకలు వాగు వద్ద నీటి ప్రవాహం ఉధృతి తగ్గడంతో అప్రోచ్ రోడ్డును పునరుద్ధరించారు. దీంతో నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిపై యథావిధిగా వాహనాలు నడుస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి రాజుపాకలు వాగు వద్ద జాతాయ రహదారుల అధికారులు తాత్కాలికంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయానికి రాజుపాకలు వాగు వద్ద నీటి ప్రవాహం ఉధృతి క్రమంగా తగ్గుముఖం పట్టింది. దీంతో జాతీయ రహదారుల అధికారులు అప్రోచ్ రోడ్డుపై కంకరవేసి రోలింగ్ చేసి పునరుద్ధరించారు. దీంతో ఈ మార్గంలో ఉదయం నుంచి యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. అలాగే పెద్దగెడ్డ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో నూతన వంతెనను ఆనుకునివున్న పాత బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగుతున్నాయి. జాతీయ రహదారుల అధికారులు పెద్దగెడ్డ బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

అత్యవసర సేవలకు కాల్ సెంటర్

చింతపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడం ప్రభావంతో గిరిజన ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసర సేవల కోసం రెవెన్యూ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ ఎ.ఆనందరావు తెలిపారు. రాజుపాకలు, పెద్దగెడ్డ అప్రోచ్ రోడ్డును సోమవారం పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలో రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేదన్నారు. మండలంలో ఇంతవరకు ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో నివాసం ఉండాలని ఆయన సూచించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అత్యవసర సేవల కోసం రెవెన్యూ కాల్ సెంటర్ 9490588729, 8950690449 నంబర్లుకు సంప్రదించాలని కోరారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

కొయ్యూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వివాదాల కారణంగా వాయిదా పడిన రాజేంద్రపాలెం, రేవళ్లు, కినపర్తి పంచాయతీలలో పెసా కమిటీ కార్యదర్శి ఉపాధ్య ఎన్నికల నిర్వహణ కోసం అధికారులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వీడీకే ప్రసాద్ ఈ శిక్షణను ప్రారంభించారు. ఈ 22 నుంచి నెల 26వ తేదీ వరకు నిర్వహించనున్న రాజేంద్రపాలెం, కినపర్తి, రేవళ్ల పెసా ఎన్నికలకు రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం గోపాలం, కినపర్తికి ఏఎస్‌వో చైతన్య, రేవళ్ల సీడీపీవో దేవమణిని ఎన్నికల అధికారులుగా నియమించినట్టు చెప్పారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

సీలేరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవీంద్ర సూచించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. వాగులు దాటే సాహసం చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ, పోలీసు అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

'బీసీ సంక్షేమ వసతిగృహంలో వారానికి ఒక్క రోజు విధులకు వార్డెన్'

చింతపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో వార్డెన్ ఒక్క రోజే విధులకు హాజరవుతున్నారని గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. సోమవారం వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో నాలుగు గదులు మాత్రమే ఉన్నాయని, వీటిలో 78 మంది విద్యార్థినులు బస చేయడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయన్నారు. వసతి గృహం ఇన్‌చార్జి వార్డెన్ వారానికి ఒక్కసారి మాత్రమే వస్తారని విద్యార్థులు తెలిపారన్నారు. విద్యార్థులకు బోజన, వసతి, భద్రత వంటమనుషులు పర్యవేక్షిస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి విద్యార్థినుల సమస్యలను పరిష్కరించాలని, పూర్తి స్థాయి వార్డెన్ నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.



అరకులోయ మండలం బొండాం కొత్తవలస ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలు



జి.మాడుగుల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కొత్తపల్లి జలపాతం



ముంచంగిపుట్టు మండలం పెదపేటలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న టీడీపీ డివిజన్ నేత పాండురంగస్వామి



పెదబయలు మండలం పరదానిపుట్టు వంతెనపై రాకపోకలను నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసు, రెవెన్యూ సిబ్బంది

ఎటు చూసినా జలమే

▸ మన్యంలో రెండు రోజులుగా కుండపోత వర్షాలు ▸ పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు ▸ నీట మునిగిన పంట పొలాలు

అరకులోయ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా ఏజెన్సీ వ్యాప్తంగా వాన కురుస్తూనే ఉంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం పడినప్పటికీ సాయంత్రం కాస్త తెరిపిచ్చింది. ఏజెన్సీలోని ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. ముఖ్యంగా పంట పొలాల్లో భారీగా నీరు చేరడంతో చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. జిల్లాలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే అరకు ప్రాంతంలో వర్షం కాస్త తక్కువనే చెప్పాలి. ఇదిలావుంటే, పద్మాపురంలో నీట మునిగిన పంట పొలాలను జడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోష్ని సోమవారం పద్మాపురం ఎంపీటీసీ సభ్యురాలు, రైతులతో కలిసి సందర్శించారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కొత్తపల్లి జలపాతం ఉగ్రరూపం

జి.మాడుగుల : భారీ వర్షాల కారణంగా మండలంలోని కొత్తపల్లి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు వచ్చి చేరుతుండడంతో స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు జలపాతాన్ని వీక్షించేందుకు ఆంక్షలు విధించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు సందర్శకులు ఇక్కడికి రావద్దని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెవెనూ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ప్రవాహంతో పొంగి పొర్లుతున్న కుంబిడిసింగి పంచాయతీలోని రాళ్ళ వంతెన, అండంగిసింగి వంతెనలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వంతెనలపై రాకపోకలు చేయరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముంచంగిపుట్టు : భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులకు పరిహారం అందే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పి.పాండురంగస్వామి కోరారు పంచాయతీ పరిధిలో పెదపేట గ్రామానికి చెందిన కె.ద్రోనా ఇల్లు వర్షానికి దెబ్బతినడంతో సోమవారం పరిశీలించారు. అలాగే వలలు, బోట్లు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయిన బాధిత మత్స్యకారులతో మాట్లాడి వివరాలను సేకరించారు. వీరికి ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందే విధంగా చూడాలని ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు.

వంతెనలపై వరద ఉధృతంగా నీటి ప్రవాహం

పెదబయలు : తుఫాన్ కారణంగా మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పోలీసుశాఖ అప్రమత్తమైంది. ఉధృతంగా వాగులు, గెడ్డలు ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల ప్రజలను సోమవారం ఉదయం నుంచి ఎస్ఐ కొల్లి రమణ తన సిబ్బందితో కలిసి అప్రమత్తం చేశారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని విజ్ఞప్తి చేశారు. పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు, కిముడుపల్లి పంచాయితీ గల పలు వంతెనలపై వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలను నిషేధించారు. అలాగే మండల శివారులో గల ప్రముఖ పర్యాటక కేంద్రం తారాబు జలపాతం వద్ద పర్యాటకుల సందర్శనను నిలిపి వేశారు. ఎక్కడైతే ప్రమాదం పొంచి ఉందో ఆ ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులను రెవెన్యూ సిబ్బందితో కలిసి ఏర్పాటు చేయించారు. చిన్న చిన్న వంతెనలు, వాగులు కూడా పొంగి ప్రవహిస్తుండడంతో వాటిపై ప్రయాణాలు చేయరాదని కోరారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. ఇదిలావుంటే, పెదకోడాపల్లి పంచాయతీ చెక్కరాయి గ్రామానికి చెందిన అర్మ తేజశ్వంత్ అనే ఏడేళ్ల బాలుడు తలసేమియా వ్యాధితో అనారోగ్యం బారిన పడడంతో అతని తండ్రి కాంతారావు అతనిని పాడేరులో గల జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్య సేవలు పొందని అనంతరం గ్రామానికి తిరుగు ప్రయాణంలో మత్స్య గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో కుమారుడ్ని భుజంపై వేసుకుని అతి కష్టమ్మీద ఒడ్డుకు చేరి స్వగ్రామానికి వెళ్లాడు. ఈ గెడ్డపై వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలని బొండాపుట్టు, భరంగిబంద, తులభరంగి, మెరకచింత, మలకరిపుట్టు, పోయిపల్లి, పిల్లిపుట్టు, వంచేడిగొంది, బోసారిగెడ్డ గ్రామాలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు.



డుంబ్రిగుడ మండలం చంపాపట్టి గ్రామానికి చెందిన కిల్లో మల్లేష్ యువకుడి మృతదేహాన్ని వరద ఉధృతిలో మోసుకు వెళుతున్న పోలీసులు

మానవత్వం చాటుకున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ : మృతదేహాన్ని గెడ్డ దాటించి డుంబ్రిగుడ ఎస్ఐతో పాటు సిబ్బంది తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని పోతంగి పంచాయతీ చంపాపట్టి గ్రామానికి చెందిన కిల్లో మల్లేష్ (18) అనే గిరిజన యువకుడు అనారోగ్యంతో అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రైవేటు వాహనంలో చంపాపట్టి గెడ్డ వరకు అంబులెన్స్‌లో తీసుకు వచ్చారు. అయితే గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మృతదేహాన్ని తరలించలేక కుటుంబ సభ్యులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ పాపినాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని కితలంగి పంచాయతీ కొసోంగుడ కాజ్‌వే నుంచి మృతదేహాన్ని గెడ్డ దాటించారు. ఇది చూసినవారంతా పోలీసుల గొప్ప మనస్సుపై ప్రశంసలు కురిపించారు.

రూ. 50 లక్షలతో ఘాట్‌రోడ్ నిర్వహణ పనులు



డముకు సమీపంలో గుంతల పూడ్చివేతను పరిశీలిస్తున్న అధికారులు

అరకులోయ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఘాట్ రోడ్డులో పడిన గుంతలను పూడ్చే పనులు గత రెండు రోజులుగా నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణలో చకచకా సాగాతున్నాయి. బొడ్డవర నుంచి కొత్తభల్లుగుడ వరకు సుమారు 41.6 కి.మీ మేర జాతీయ రహదారి పరిధిలో ఉండడంతో రహదారిపై పడిన గండ్లు పూడ్చివేసే పనులను సుమారు రూ.50 లక్షలతో చేపడుతున్నారు. హైవే కు చెందిన డీఈఈ కె.సత్య భాస్కర్, ఏఈఈ సురేష్ పర్యవేక్షణలో ఘాట్ రోడ్డులో పడిన గుంతలన్నింటినీ వెట్‌మిక్స్ వేసి కాంట్రాక్టర్ ద్వారా పూడ్చివేయిస్తున్నారు. ఈ సందర్భంగా సదరు అధికారులు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా పనులు చేపడుతున్నట్టు చెప్పారు. వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే వెట్‌మిక్స్ వేసిన చోట సిమెంట్ కాంక్రీట్ పనులు చేపడతామన్నారు.

అంత వరకు వాన.. అంతలోనే మంచు...



అనంతగిరిలో సోమవారం మంచు సోయగాలు కనువిందు చేశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. ఆ తరువాత కాసేపు తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో అంతా ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. అయితే ప్రకృతి ప్రేమికులు మాత్రం సెల్ఫీలకు దిగుతూ తెగ ఎంజాయ్ చేశారు. - అనంతగిరి

'టీడీపీ మండల అధ్యక్ష ఎన్నిక వాయిదా తగదు'



విలేకరుల సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

అనంతగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 24 పంచాయతీలకు సంబంధించి గ్రామ కమిటీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలు పూర్తయినప్పటికీ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికలు వాయిదా వేస్తుండడం తగదని టీడీపీ సీనియర్ నాయకులు అంటిపర్తి బుజ్జిబాబు, ఆనందరావు తదితరులు అన్నారు. సోమవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు అరకు నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు మండల పార్టీ అధ్యక్ష ఎన్నిక నిర్వహిస్తామని చెప్పడంతో హాజరయ్యామన్నారు. అయితే ఒక వర్గానికి కొమ్ముకాస్తూ ఏకపక్ష నిర్ణయంతో వాయిదా వేశారని వారు ఆరోపించారు. 24 పంచాయతీలకు చెందిన గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి ఎన్నికపై వివరించినట్టు చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి, త్వరలోనే ఎన్ని కలు నిర్వహించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. నాయకులు గాలి నరసింహమూర్తి, జోగులు, లక్ష్మణరావు, అప్పారావు, ఎస్. దొన్ను, నిర్మల, దయానిధి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.


నర్సీపట్నం: పొంగిపొర్లుతున్న దుగ్గాడ రామన్నచెరువు


రావికమతం: వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న గుమ్మాళ్లపాడు పోరమ్మ చెరువు


దేవరాపల్లి: నిండు కుండలా ఉన్న రైవాడ జలాశయం

పరవళ్లు తొక్కుతున్న గెడ్డలు, వాగులు

భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న నదులు, చెరువులు

మునిగిన పంట పొలాలు... జలమయమైన లోతట్టు ప్రాంతాలు

ఏరులై పారుతున్న రహదారులు... జన జీవనానికి అవాంతరాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాలు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. శనివారం రాత్రి నుంచి సోమవారం రోజంతా పడిన వానకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు ఏరులై పారుతున్నాయి. జన జీవనానికి అవాంతరాలు ఏర్పడుతున్నాయి.

నర్సీపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో భారీ వర్షానికి నదులు, చెరువులు కొత్త నీటితో పరవళ్లు తొక్కుతున్నారు. చెరువులు నిండిపోయి పొర్లుకట్టు నుంచి దిగువకు జాలువారుతున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరద నీరుతో రావాణాపల్లి రిజర్వాయర్ నిండిపోయి జలకళ ఉట్టిపడుతున్నది. నర్సీపట్నం ఉత్తరవాహిని వద్ద వరహానది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెదబొడ్డేపల్లి, ధర్మసాగరం, నర్సీపట్నం పెద్ద చెరువు, దుగ్గాడ రామన్న చెరువులో పొర్లుకట్టు నుంచి ప్రవహిస్తున్నాయి. మండలంలోని కృష్ణాపురం సమీపం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లిలో వరి పొలాలలోకి వరద నీరు చేరింది. మండలంలో 26 ఎకరాలలో వరద ప్రభావానికి గురైనట్టు అధికారులు గుర్తించారు. రైతులు గట్లు కొట్టి నీరు బయటకు పంపారు.

కృష్ణాదేవిపేటలో...

కృష్ణాదేవిపేట: గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆది, సోమవారాలు కురిసిన భారీ వర్షానికి గెడ్డలు చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. పాతకృష్ణాదేవిపేట, ఏఎల్ పురం, లింగంపేట, గింజర్తి, సిహెచ్.నాగాపురం, విప్పలపాలెం, పల్లావూరు గ్రామాల్లో రోడ్లపై నీరు ఏరులై పారింది. అలాగే వర్షం నీటిలో పంట పొలాలు మునిగిపోయాయి.


కృష్ణాదేవిపేట: వర్షం నీటితో ఉధృతంగా పారుతున్న బోడ్డేరు గెడ్డ

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు పొంగి పారుతున్నాయి. మండలంలోని సర్పానది, వరహానదితో పాటు జాజి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గిడుతూరు, మల్లవరం,బయ్యావరం, పైడిపాల, మాకవరపాలెం గ్రామాల్లో పొలాలు నీటిలో మునిపోయాయి. మాకవరపాలెం హైస్కూల్ ఆట స్థలం నీటితో నిండిపోయింది.


మాకవరపాలెం: పైడిపాల సెంటరులో నీట మునిగిన వరి నాట్లు

రావికమతంలో...

రావికమతం: మండలంలో ఎడతెరిపి లేని వర్షానికి ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. గెడ్డలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండు కుండల్లా కనిపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతమైన దొండ పూడి రాణా వద్ద, జి.చీడిపల్లి వద్ద వరి నాట్లు నీటి మునిగాయి. మేడివాడ పెద్ద చెరువు, గర్నికం కోమటి చెరువు నిండిపోయాయి. పంట పొలాలు మునగిపోయాయి. కల్యాణపులోవ రిజర్వాయర్‌ను తహశీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో సీతారాస్వామి సోమవారం పరిశీలించారు. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 451.02 అడుగులకు చేరిందని ఏఈ డి.సూర్య తెలిపారు. సర్పా నదిని ఆనుకుని ఉన్న గ్రామాల రైతులు అప్రమత్తం ఉండాలని కోరారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో భారీ వర్షాలకు బంగారుమెట్ట, లోపూడి, లూలూరు, పీడీ.పాలెం, గంటికొర్లాం, చిన అప్పన్నపాలెం, పోలేపల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల వరి పంట నీట మునిగింది. వడ్డాది తాచేరు నది సమీపంలో నీటిలోనే ఉంది. ఎక్కువ రోజులు నీటిలోనే పొలాలు ఉంటే పంట పాడవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీట మునిగిన వరి పంటను అధికారులు, నాయకులు పరిశీలించారు.

మాడుగులలో...

మాడుగుల: మండలంలో సోమవారం కూడా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. దీంతో వరి నారు మడులు మునిగిపోయాయి. మాడుగుల పశువుల ఆసుపత్రి ఆవరణ జలమయమై దారి లేకుండా మారింది. అలాగే వాగులు, గెడ్డలు వర్షం నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని తుఫాన్ వర్షాలకు ఎనిమిది విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. ఎల్‌బి.పట్నం గ్రామంలో రెండు వ్యవసాయ విద్యుత్ స్తంభాలు కూలిపోగా, ఎస్ఎన్.పురంలో రెండు స్తంభాలు, అప్పలరాజుపురం నుంచి ఖండివరం వచ్చే దారిలోను, గొప్పూరులోను నాలుగు స్తంభాలు నేలకొరిగాయి. తహశీల్దార్ కిశోర్‌లింకన్, ఎంపీడీవో వి.హేమసుందర్రావు సోమవారం గ్రామాల్లో పర్యటించి జలాశయాలను పరిశీలించారు. వర్షాలు తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.


బుచ్చెయ్యపేటలో నీట మునిగిన వరి పంట


మాడుగులలో కురుస్తున్న వర్షం

దేవరాపల్లిలో...

దేవరాపల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీటి వనరులు నిండిపోయాయి. గెడ్డలు, వాగులు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని 19 గ్రామాల్లో 270 ఎకరాల వరకు పంట నీట మునిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. పలు గ్రామాల్లో ఏవో కాంతమ్మతో కలసి సోమవారం పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైవాడ జలాశయంలో నాలుగు వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, మూడు రోజుల క్రితం 111.30 మీటర్లు ఉంది. జలాశయ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద నీరు పారడంతో జలాశయంలో వరదనీరు నాలుగు వేల క్యూసెక్కులకు చేరుతుంది. దీంతో సాయంత్రానికి జలాశయ నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరిందని డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ లక్ష్మీదేవీ, ఎంపీడీవో సువర్ణరాజు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోండి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మండలంలోని ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి భవనాలను సోమవారం ప్రారంభించారు. రూ.31 లక్షలతో నిర్మించిన ఈ భవనాలతో పాటు 1979-80 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు బి.శివప్రసాద్, బోజంకి వెంకటరమణ, సింగంపల్లి వరప్రసాద్, యామాద్రి పోలీసు, కేవీ రమణమూర్తి రూ.12 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను గుర్తించి పేద, మధ్య తరగతి పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంపీటీసీ సభ్యులు గౌతమి శంకరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.సింహాచలం, ప్రధానోపాధ్యాయుడు ఆళ్ల శేఖర్, సమగ్రశిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నది ఒడ్డు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కె.కోటపాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మాడుగులలో పెద్దేరు రిజర్వాయర్, చీడికాడ మండలంలో కోనాం రిజర్వాయర్, దేవరాపల్లి మండలంలో రైవాడ రిజర్వాయర్‌కు వరద నీరు ఎక్కువగా వచ్చి చేరుతుందన్నారు. అలాగే నాలుగు మండలాల ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వర్షం తీవ్రతను గమనిస్తూ ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలకు వరి పంటలు నీట మునిగి దెబ్బతిన్నట్లయితే, పంటను కాపాడే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, రైతులకు సూచనలు ఇవ్వాలని సూచించారు.

చోద్యం సహకార సంఘ ప్రతినిధుల బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన సాంబమూర్తి

గొలుగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోద్యం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన కమిటీ ప్రతినిధులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా చిటికెల సాంబమూర్తి, డైరెక్టర్లుగా రేగుబళ్ల శివ, నూకరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో చైర్మన్ సాంబమూర్తి మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు. అలాగే రైతులు రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు కొల్లి సత్యనారాయణ, ఆదపురెడ్డి గోపి, కామిరెడ్డి గోవింద్, సుర్ల బాబ్జీ, కొల్లి రాంబాబు, కె.రవివర్మ, గెడ్డం ఆనంద్, పుల్లేటికుర్తి రమేశ్, జనసేన నేత గండెం దొరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆటో దగ్ధం

దేవరాపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అల్లు వెంకటరావుకు చెందిన ఆటో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వెంకటరావు ఆదివారం రాత్రి ఇంటి ముందున ఆటో నిలపగా, సోమవారం ఉదయం మంటలు చెలరేగడంతో ఆటో అగ్నికి ఆహుతైంది. చోడవరం అగ్నిమాపక శకటం చేరుకున్నప్పటికే ఆటో దగ్ధమైంది. బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ జరగడంతోనే మంటలు చెలరేగినట్టు భావిస్తున్నారు. ఆటో కాలిపోవడంతో జీవనాధారం కోల్పోయామని, అధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు వెంకటరావు వేడుకున్నారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే సహాయక చర్యలు



బుచ్చెయ్యపేట: కాజ్‌వేపై పారుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు... చోడవరం: కాలువల్లో పూడిక తీయిస్తున్న ఎమ్మెల్యే

చోడవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముంపునకు గురైన బాలాజీనగర్, బానయ్యకోనేరు. రెల్లికాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం సహాయ చర్యలు చేపట్టారు. ముంపునకు గురైన కాలనీల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఎక్స్‌కవేటర్లతో బానయ్యకోనేరు, కాలువలలో పూడిక తీసి వాననీరు పోయేలా తగిన చర్యలు చేపట్టారు. సోమవారం పెద్దగా వర్షం కురవకపోవడంతో కాలనీల్లో చేరిన వాననీరు పూర్తిగా తగ్గింది. కాగా కాలనీల్లోని కాలువల్లో పూడిక తీసి వాననీరు త్వరితగతిన పోయేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మంగళవారం కూడా భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, సకురు కోటేశ్వరరావు, వార్డు సభ్యులు నేమాల హరి, తానవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలు పునరుద్ధరిస్తాం: ఎమ్మెల్యే

బుచ్చెయ్యపేట, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వేలను మరమ్మతు చేసి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. సోమవారం ఆర్అండ్‌బీ అధికారులతో కలసి విజయరామరాజుపేట, తాచేరు, పెద్దేరు వంతెన పరిశీలించారు. వర్షాలు తగ్గిన వెంటనే వంతెనకు తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రతిపాదన చేయాలని అధికారులను ఆదేశించారు, తాత్కాలిక మరమ్మతులకు వెంటనే నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. అలాగే బీఎన్ రోడ్డుపై కాజ్‌వే తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. నీట మునిగిన వరి పంటలను పరిశీలించి నష్టాలపై నివేదికలు తయారు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సాంబశివరావు, ఏఈ సాయి శ్రీనివాస్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, కూటమి నాయకులు దొండా సన్యాసిరావు, దొండా గిరిబాబు, దొండా నరేశ్, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, సింగంపల్లి రమేశ్, వీర్ల సురేశ్, కోరుకొండ సూరి అప్పారావు పాల్గొన్నారు.

మొండిగెడ్డ ఉగ్రరూపం

వరహాపురం-పెదగోగాడ రోడ్డుపై పొంగిపొర్లుతున్న వరద నీరు

పది గ్రామాల ప్రజల రాకపోకలు బంద్


పెదగోగాడ రహదారిపై పొంగి ప్రవహిస్తున్న మొండిగెడ్డ

చీడికాడ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొండి గెడ్డ ఉగ్రరూపం దాల్చింది. వరహాపురం-పెదగోగాడ రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డ ఉప్పొంగుతుండడంతోపది గ్రామాల ప్రజలు, వాహన చోదకుల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా పెదగోగాడ పీహెచ్‌సీ పరిధిలోని వరహాపురం, తునివలస, జెబి.పురం, దండిసురవరం, కట్టువాని అగ్రహారం, వింటిపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన రోగులు, పెదగోగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఈ రహదారిపైనే రాకపోకలు సాగించాలి. గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులు అత్యవసర సేవల కోసం నరకం చూస్తున్నారు. దీంతో వరహాపురం నుంచి మరో పది కిలోమీటర్లు అదనంగా ప్రయాణిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ కాజ్‌వే నిర్మించాలని వారు కోరుతున్నారు.

తాండవ రిజర్వాయర్‌ను సందర్శించిన ఆర్డీవో


తాండవ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ, అధికారులు

నాతవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్‌ను నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ సోమవారం సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వలను పరిశీలించారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 375 అడుగులకు చేరిందని, ఇన్‌ఫ్లో ద్వారా 1600 క్యూసెక్కుల నీరు వస్తున్నదని డీఈ అనురాధ ఆర్డీవోకు వివరించారు. అలాగే ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. భారీ వర్షాల కారణంగా నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని డీఈఈ, అధికారులను ఆర్డీవో ఆదేశించారు. తాండవ నదీ పరివాహక ప్రజలు అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న గునుపూడి ఆర్అండ్‌బీ రహదారిని తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను వారు ఆదేశించారు.

సీతాఫలాల ధర పతనం

కావిడి రూ.500.. నిరాశలో గిరి రైతులు


సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న రైతులు

మాడుగుల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో సీతాఫలాల ధర పతనమైంది. పాడేరు మండలంలోని వంట్లమామిడి, కక్కి, కందులపాలెం, దేవాపురం, పులుసుమామిడి, సలుగు తదితర సుదూర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన సీతాఫలాలకు తగిన ధర లభించకపోవడంతో గిరిజన రైతులు నిరాశ చెందారు. భారీ వర్షాల కారణంగా వ్యాపారులు ఎక్కువగా రాకపోవడంతో సీతాఫలాలకు డిమాండ్ లేకపోయింది. కావిడి సీతాఫలం రూ.500కు మించి అమ్ముడుపోలేదు. కనీసం రవాణా, మోత ఖర్చులు కూడా రాలేదని గిరిజన రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

విరిసిన బ్రహ్మ కమలం


ఉపాధ్యాయురాలి ఇంట్లో విరిసిన బ్రహ్మకమలం

చోడవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): హిమాలయాల్లో ఎక్కువగా కనిపించే బ్రహ్మకమలం స్థానిక టీచర్స్ కాలనీలో ఉపాధ్యాయురాలు బి. హైమవతి ఇంట్లో ఆదివారం రాత్రి వికసించింది. ఇటీవల కాలంలో బ్రహ్మకమలం మొక్కలు ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో పెంచుతున్న సంగతి తెలిసిందే. వికసించిన బ్రహ్మకమలం పువ్వు ఒక్కరాత్రి మాత్రమే ఉండి వాడిపోతుంది. హిందూ సంస్కృతిలో బ్రహ్మకమలం అత్యంత ప్రాధాన్యత కలిగిన, దైవికశక్తికి గుర్తుగా భావిస్తుంటారు. ఈ మొక్కను ఇంటిలో పెంచితే ప్రతికూల శక్తులు కూడా తొలగిపోతాయని హిందువుల నమ్మకం.

సచివాలయాల్లో కంట్రోల్ రూములు

రావికమతం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లోనూ సోమవారం కంట్రోల్ రూములు ప్రారంభించామని ఎంపీడీవో సీతారామస్వామి తెలిపారు. తుఫాన్ ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో గ్రామ స్థాయిలో ఎదురయ్యే నష్టాలు నివారించేందుకు 24 గంటలూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పంట పొలాలు నీటి ముంపునకు, చెరువులు, గెడ్డల గట్లు కోతకు గురైతే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే విద్యుత్ తీగలు తెగినా, చెట్లు కూలిపోయినా గ్రామ సచివాలయానికి వెళ్లి ప్రజలు ఫిర్యాదు చేయాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల్లో తహశీల్దార్ పర్యటన

మాకవరపాలెం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడపాల, నారాయణరాజుపేట గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో తహశీల్దార్ జి.వెంకటరమణ పర్యటించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలకు ఈ సందర్భంగా తహశీల్దార్ సూచించారు. సర్పానదికి ఆనుకుని ఉన్న తాడపాల, పెద్దిపాలెం, కొండల అగ్రహారం, నారాయణరాజుపేట, జంగాపల్లి గ్రామాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మేరీజోన్స్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండలంలోని బుచ్చెంపేట, కొమరవోలు, రత్నంపేట, వడ్డిప, జగ్గంపేట, పడాలపాలెం గ్రామాల్లో తహశీల్దార్ నాగమ్మ పర్యటించారు. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అలాగే సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కృష్ణాదేవిపే, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట గ్రామానికి చెందిన పైల అప్పలనాయుడు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. అప్పలనాయుడు అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.40 వేల నగదు, పది వేల విలువైన వస్తువులను సోమవారం అందించారు. ఇప్పటికే 1994-95 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల్లో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొరబాబు, శ్రీరామ్మూర్తి, లవకుశ, మీరాసాహెబ్, వెంకటరావు, నూకరాజు, రామ్‌కుమార్, అప్పారావు, సంధ్య, బంగారమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.


వడ్డాది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు


ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో వరహా నది ఉధృతి


జలకళ సంతరించుకున్న పాయకరావుపేటలోని భూమి ఆనకట్ట


నిండుకుండను తలపిస్తున్న రావణాపల్లి రిజర్వాయర్


మాకవరపాలెం: పరవళ్లు తొక్కుతున్న సర్పానది


బుచ్చెయ్యపేట: కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డు

జోరు వాన

... 5వ పేజీ తరువాయి

వరినాట్లు వేసిన పొలాలు నీట మునగగా, ఇంకా నాట్లు పడని భూముల్లో కూడా భారీగా వర్షం నీరు చేరడంతో పంట పొలాలు చెరువులను తలపించే విధంగా కనిపిస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి పెద్దగా వర్షం కురవకపోవడంతో పొలాల్లో చేరిన వర్షం నీరు తగ్గుముఖం పడుతున్నది. వాగులు వంకలు ఇంకా ఉధృతంగానే పారుతున్నాయి. చీడికాడ మండలంలోని వరహాపురం, పెదగోగాడ గ్రామం మధ్యలో మొండిగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో పది గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి.

జల దిగ్బంధంలో ఏడు గ్రామాలు

మాడుగుల: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తాడివలస గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏడు గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం వారపు సంతకు వెళ్లిన గిరిజనులు గెడ్డ దాటి గ్రామాలకు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. కొందరు ప్రాణాలకు తెగించి గెడ్డ దాటి వెళ్లగా, మరికొందరు వెనుదిరిగారు.

వడ్డాది- చోడవరం మధ్య నిలిచిన రాకపోకలు

బుచ్చెయ్యపేట: భారీ వర్షాలకు వడ్డాది కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించింది. విజయరాయరాజు పేట వద్ద తాచేరు వంతెన కూలిన దగ్గర నిర్మించిన డైవర్షన్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వడ్డాది- చోడవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు అటు చోడవరం నుంచి విజయరామరాజుపేట వరకు, ఇటు నర్సీపట్నం నుంచి వడ్డాది వరకు తిరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

... 5వ పేజీ తరువాయి

మరీ షెడ్లు వేయిస్తున్నారు. పంచాయతీ అప్రూవ్డ్ లేఅవుట్‌గా నమ్మబలికి ఇప్పటికే ఏడు షెడ్లను ఇతర ప్రాంతాలకు చెంది వారికి ప్లాట్ రూ.10 లక్షలు చొప్పున అమ్ముకున్నట్టు తెలిసింది. మరో పది నుంచి 15 ప్లాట్‌లు విభజించి ఆయా జాగాల్లో కూడా షెడ్లు నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో భూమి ఎకరా రూ.కోటిపైనే పలుకుతోంది. ఈ లెక్కన ఆక్రమణదారులు షెడ్లు వేస్తున్న జాగా విలువ రూ.కోటిన్నర పైమాటే. ఆయా భూముల్లో సాగు చేసుకుంటున్న గ్రామానికి చెందిన గొల్లవెల్లి బాబూరావు, మేడిశెట్టి స్వామినాయుడు, నీలబాబు, గొంతిన నీలబాబు, శ్రీనివాస్, లక్ష్మి, మరికొందరు గత బుధవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఆర్‌ఐని గ్రామానికి పంపి నిర్మాణాలను అడ్డుకున్నారు. అయితే సిబ్బంది ఏడు షెడ్లు నిర్మాణం జరుగుతుండగా కేవలం ఒక షెడ్డును మాత్రమే కూల్చేసి తిరిగి వెళ్లిపోయారు. రెండు రోజులు మాత్రమే పనులు నిలిపేసిన ఆక్రమణదారులు మళ్లీ యథావిధిగా షెడ్ల నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇప్పటికే ఏడు షెడ్ల ఏర్పాటుకు గోడలు నిర్మించారు. దీనిపై రైతులు మరోసారి సోమవారం కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. పీఎస్ బోనంగి ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకొని, ఆయా భూములపై ఆధారపడి జీవిస్తున్న తమను ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం

పీఎస్ బోనంగి గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై తహశీల్దార్ బి.నాగరాజును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా సర్వే నంబర్ 2/2లో ప్రభుత్వ భూములు ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఆయా భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఇటీవల కొందరు రైతుల ద్వారా ఫిర్యాదు అందిందని తెలిపారు. ఆర్ఐ, సర్వేయర్‌ను గ్రామానికి పంపి సర్వే చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్కడి ఆక్రమణలను తొలగించి భూమి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

లక్కీడ్రా ద్వారా బార్‌ల కేటాయింపు

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సెప్టెంబరు 1 నుంచి 2028 సెప్టెంబరు 1 వరకు వచ్చే మూడేళ్ల పాటు కొత్త బార్ పాలసీ అమలులో ఉంటుందని తెలిపారు. గతంలో వేలం పాటల ద్వారా బార్లను కేటాయించగా, ప్రభుత్వం ఈసారి లాటరీ పద్ధతిన బార్లను కేటాయించనుందని పేర్కొన్నారు. జిల్లాలో నర్సీపట్నంలో 2, ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలో 1.. మొత్తం మూడు కొత్త బార్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం బార్లు రాత్రి 11 గంటలు వరకు మాత్రమే తెరిచి ఉండేవని, ప్రభుత్వ కొత్త బార్ల పాలసీ ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు తెరుచుకొనే వెసులుబాటు కల్పించిందన్నారు. బార్ల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకొనేవారు 50 వేలు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షలలోపు జనాభా ఉండే ప్రాంతంలో రూ.55 లక్షలు, 5 లక్షలపైగా జనాభా ఉండే ప్రాంతాల్లో అయితే రూ.75 లక్షలు చొప్పున బార్ల లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో లైసెన్స్ ఫీజు ప్రతి ఏడాది ఆగస్టు నెలలో మొత్తం ఒకేసారి చెల్లించాలనే నిబంధన ఉండేదని, కొత్త పాలసీ ప్రకారం బార్ పొందిన వ్యక్తి ఆరు విడతలుగా ఏడాదిలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఏడాది పది శాతం లైసెన్స్ ఫీజు పెరుగుతుందని, లక్కీ డ్రాలో పాల్గొనే దరఖాస్తుదారుడు రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపారు. ఒక బార్ ఏర్పాటు కోసం కనీసం 4 దరఖాస్తులు తప్పనిసరిగా రావాలన్నారు. అంతకంటే తక్కువ దరఖాస్తులు అందితే మరోసారి దరఖాస్తులు స్వీకరణ కొనసాగిస్తామన్నారు. కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా తెరిచి ఎంపిక చేస్తామని తెలిపారు. గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే సంబంధిత వ్యక్తికి ముందుగానే రెస్టారెంట్ లైసెన్స్ ఉండాలనే నిబంధన ఉండేదని, కొత్త పాలసీ ప్రకారం బార్ లైసెన్స్ లక్కీ డ్రాద్వారా పొందిన వ్యక్తి 15 రోజుల గడువు లోగా రెస్టారెంట్ లైసెన్స్ అనుమతి పత్రాలు సమర్పించే వెసులుబాటు కల్పించారని తెలిపారు. సోమవారం నుంచి ఆన్‌లైన్ విధానంలో లేదా ఆఫ్‌లైన్ విధానంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బార్ల ఏర్పాటు కోసం దరఖాస్తుల స్వీకరిస్తామని చెప్పారు. ఈ నెల 28వ తేదీన కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా తీస్తామని, సెప్టెంబరు 1 నుంచి కొత్త బార్‌లు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కారం


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

» అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్‌ఓ సత్యనారాయణరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ అధికారులు ప్రజల నుంచి తీసుకున్న అర్జీల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ అర్జీలు పరిష్కరించలేకపోతే ఎందుకు పరిష్కారం కాలేదో అర్జీదారులకు వివరించాలన్నారు. అర్జీదారులు అర్జీ స్థితిని తెలుసుకునేందుకు 1100కి కాల్ చేసి తెలుసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో 94 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ సుబ్బలక్ష్మి, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

» ఏఎస్పీ ఎల్. మోహన్‌రావు

అనకాపల్లి రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలను సత్వరమే పరిష్కరించి బాధితులకు భరోసా ఇవ్వాలని ఏఎస్పీ ఎల్. మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి బాధితుల గోడును ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ అర్జీను నిశితంగా పరిశీలించి వాస్తవంగా నిర్ధారించిన వెంటనే చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీ అందిన ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 20 అర్జీలు అందగా.. అందులో ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి అంశాలపై వినతులు అందినట్లు జిల్లా పోలీస్ కార్యాలయ విభాగం అధికారులు తెలిపారు.


అర్జీదారునితో మాట్లాడుతున్న ఏఎస్పీ ఎల్. మోహన్‌రావు

ఆర్‌ఈసీఎస్ ఉద్యోగుల అరాచకం

... 5వ పేజీ తరువాయి

ఈపీడీసీఎల్ ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకూ అధికంగా పొందిన జీతాలను ఎలా రికవరీ చేయాలా?...అని ఆలోచిస్తోంది. ఇలా ఒక్కొక్క బండారం బయట పడుతుండడంతో త్వరలో 51 విచారణతో నిధుల దుర్వినియోగం కూడా వెలుగులోకి వస్తుందని అక్రమార్కులు భయపడుతున్నారు. దీనిని అడ్డుకోవాలని యత్నిస్తున్నారు.

వినియోగదారుల పేరుతో హైకోర్టులో కేసు

సొసైటీలో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఐదుగురు (ఎం.పరదేశి నాయుడు, ఆడారి ప్రసన్నరాణి, బొమ్మిశెట్టి సత్యవేణి, విల్లూరి శివకుమార్, బొక్కం కనకారావు) సాధారణ విద్యుత్ వినియోగదారుల్లా ఈ నెల 4వ తేదీన హైకోర్టులో పిటిషన్ వేశారు. అనకాపల్లి ఆర్‌ఈసీఎస్‌పై జరుగుతున్న 51 విచారణను నిలిపివేయాలని, దానిపై స్టే ఇవ్వాలని కేసు వేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనల ప్రకారం...ఏ ప్రభుత్వ సంస్థపై గాని, ఉద్యోగులపై గాని ఆరోపణలు వచ్చి ప్రభుత్వం విచారణ చేస్తుంటే...దానిని ఆపాలని కోర్టుకు వెళ్లే హక్కు అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉండదు. ఆ విచారణను ఎదుర్కోవాలి. నివేదిక వచ్చాక చర్యలకు సిద్ధపడాలి. కానీ ఇక్కడ ఈ ఐదుగురు కూడా తాము ఉద్యోగులమని పిటిషన్‌లో పేర్కొనకుండా వాస్తవం దాచి పెట్టడం గమనార్హం. ఈ నెల 4వ తేదీన కేసు ఫైల్ కాగా ఆ విషయం వెంటనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంబంధిత అధికారులకు తెలియజేస్తారు. దానిపై కౌంటర్ వేయడానికి సమాచారం ఇవ్వాలని కోరతారు. ఆ వివరాలు ఆర్‌ఈసీఎస్‌కు రావాలి. దానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎండీగా అనకాపల్లి ఈపీడీసీఎల్ ఎస్ఈ వ్యవహరిస్తున్నారు. జిల్లా సహకార శాఖ అధికారి 51 ఎంక్వయిరీకి అధికారిని నియమించారు. హైకోర్టులో కేసు వేసిన వారు ఎవరో ముందుగా చూడాలి. వారు ఇక్కడ పనిచేస్తున్న వారే కాబట్టి అది సర్వీసు రూల్స్‌కు వ్యతిరేకం అయినందున చర్యలు చేపట్టాలి. కానీ ఎవరూ తమకు హైకోర్టులో కేసు విషయం తెలియదని చెబుతున్నారు. ఆ కేసు వేసిన ఉద్యోగులను పిలిచి కనీస విచారణ కూడా చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా సహకార శాఖ అధికారులు మేల్కొంటారా? లేదో మరి.

కమర్షియల్ ట్యాక్స్ విశాఖపట్నం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కమర్షియల్ ట్యాక్స్ విశాఖపట్నం డివిజన్ కమిటీ ఎన్నికలు ఆదివారం లంకెలపాలెంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా విజయనగరం డివిజన్ అధ్యక్షుడు బి. మధు, సహాయ ఎన్నికల అధికారిగా టి.శ్రీనివాసరావు ఎన్నికలు జరిపించారు. కమిటీ అధ్యక్షులుగా పి. సూర్యనారాయణ (రవి), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి. గణపతి వర్మ, సెక్రటరీగా కె. జగదీష్‌కుమార్, కోశాధికారిగా శ్రీబాల రవికిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షులుగా పి.అప్పలరాజు, సీహెచ్‌కే. రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా బి. సుశీల, డి. ఉత్తర కుమార్. ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

నేటి నుంచి పలు రైళ్ల రద్దు

విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం డివిజన్ పరిధిలోని పార్వతీపురం-డొంకినవలస నడుమ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం నుంచి ఈ నెల 28 వరకు పలు రైళ్లను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కొన్ని రైళ్ల గమ్యాలను కుదించామని, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేశామని పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు: ఈనెల 19 నుంచి 27 వరకు విశాఖ-రాయ్‌పూర్ పాసింజర్ (58528), విశాఖ-కోరాపుట్ పాసింజర్ (58538), విశాఖ-భవానీపట్న పాసింజర్ (58504). ఈనెల 20 నుంచి 28 వరకు రాయ్‌పూర్-విశాఖ పాసింజర్ (58527), కోరాపుట్-విశాఖ పాసింజర్ (58537), భవానీపట్న-విశాఖ పాసింజర్ (58503).

రీ షెడ్యూల్: ఈ నెల 22 నుంచి 27 వరకు విశాఖ-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20830) నిర్ణీత సమయం కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా, తిరుగు ప్రయాణంలో దుర్గ్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20829) మూడు గంటలు ఆలస్యంగా బయలుదేరతాయి. అలాగే విశాఖలో ఉదయం 9.20 గంటలకు బయలుదేరాల్సిన విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈ నెల 20, 21, 23, 24, 26 తేదీల్లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరేలా (ఐదు గంటలు ఆలస్యంగా) రీ షెడ్యూల్ చేశారు.

గమ్యం కుదింపు: గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) ఈ నెల 19 నుంచి 26 వరకు గుంటూరు-విజయనగరం మధ్య, తిరుగు ప్రయాణంలో రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) ఈ నెల 20 నుంచి 27 వరకు విజయనగరం-గుంటూరు మధ్య రాకపోకలు సాగిస్తాయి. విజయనగరం-రాయగడ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశారు.

క్రైం... crime news

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడి మృతి


మృతిచెందిన పవన్‌కుమార్

గొలుగొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి జారిపడి యువకుడు మృతి చెందినట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం కొత్తఎల్లవరం గ్రామంలో బైయపురెడ్డి పెంటయ్యనాయుడు పొలంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా డ్రైవర్ పక్కనే కూర్చున్న కొంకన పవన్‌కుమార్(22) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. ఈయనది నాతవరం మండలం ములగపూడి బెన్నవరం గ్రామం. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామారావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులకు అప్పగించినట్టు ఆయన తెలిపారు.

50 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

అనంతగిరి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేం ద్రంలోని సోమవారం సాయంత్రం 50 కిలోల గం జాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అరకు వైపు నుంచి వస్తున్న డస్టర్ కారును ఆపి తనిఖీ చేయగా.. 50 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయి తరలిస్తున్న నిందితుడు సర్ఫరాజ్ సయ్యుద్‌ను అరెస్టు చేసి, గంజాయితో పాటు వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మైదాన ప్రాంతం మీదుగా గుజరాత్‌కు గంజాయిని తరలిస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస రావు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి కశింకోట మధ్యలో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. మృతుడు సుమారు 5.4 అడుగుల ఎత్తు ఉంటాడని, అతని కుడి చేయి విరిగిందని, మృతదేహం దుర్భరంగా మారిందన్నారు. ముఖం కూడా గుర్తు పట్టడానికి వీల్లేకుండా ఉందని ఆమె తెలిపారు. మృతదేహం పై సిమెంట్ కలర్ షర్టు, నేవీబ్లూ జీన్ ఫ్యాంట్ కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుని షర్టు జేబులో చిరిగిన రైల్వే టికెట్ ఉందన్నారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు 73820 58996 నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


మృతిచెందిన సాయిగిరీష్

చీడికాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శిరిజాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కన్నూరు సాయిగిరీష్ (28) విశాఖలోని హనుమంతవాక జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సాయిగిరీష్ పెదనాన్న కన్నూరు శ్రీరామ్మూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. శిరిజాం గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మీనాయుడు పిల్లల చదువుల నిమిత్తం పెందుర్తిలో నివాసం ఉంటున్నాడు. పెద్దకుమారుడైన సాయిగిరీష్ చదువు పూర్తి చేసుకొని రెండేళ్ల క్రితం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. మూడు నెలల కిందట చెన్నై వచ్చాడు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో శుక్రవారం ఉదయం తన తల్లిదండ్రులను చూసేందుకు పెందుర్తి వచ్చాడు. శనివారం ఉదయం విశాఖలో ఉన్న తన స్నేహితుల వద్దకు వెళ్లిన యువకుడు సాయంత్రం తిరిగి హనుమంతవాక జంక్షన్ మీదుగా పెందుర్తి వెళుతుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న మరో యువకుడు బలంగా ఢీకొట్టాడు. దీంతో సాయిగిరిష్ స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయిస్తుండగా, సోమవారం రాత్రి మృతి చెందినట్టు శ్రీరామ్మూర్తి తెలిపారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

నగల షాపు యజమానిపై కేసు నమోదు

పాయకరావుపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):పలువురుకి అధిక వడ్డీలు ఆశ చూపించి కోట్ల రూపాయలు వసూలు చేసి ఇటీవల పరారైన పాయకరావుపేట మండలానికి చెందిన వ్యక్తిపై తుని పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఇందుకు సంబంధించి తుని పట్టణ సీఐ జి.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన పెదిరెడ్డి వెంకటేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు తునిలో జ్యువెలర్స్ షాపు నిర్వహిస్తూ తుని, కోటనందూరు తదితర మండలాలకు చెందిన వారి నుంచి అధిక వడ్డీలు, బంగారం తక్కువ ధరకు ఇస్తామని ఆశ చూపించి పెద్ద మొత్తంలో నగదు వసూలుచేసి పరారైన సంగతి తెలిసిందేనన్నారు. దీనిపై కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామన్నారు. వెంకటేశ్వరరావు ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఉంటే తుని పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి వివరాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. మండలానికి చెందిన పలువురు బాధితులు పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు దివ్యాంగుడు గణేశ్ ఎంపిక


అన్నం గణేశ్

ఎస్.రాయవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో అక్టోబరు 12 నుంచి 18వ తేదీ వరకు జరగబోయే పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీల్లో దేశం తరుపున ఆడేందుకు మండలంలోని పెనుగొల్లు శివారు సోముదేవుపల్లికి చెందిన దివ్యాంగుడు క్రీడాకారుడు అన్నం గణేశ్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని సోమవారం వాలీబాల్ క్రీడాకారుడు గణేశ్ స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 9న బెంగళూరులో నిర్వహించిన ఎంపికల్లో 14 మందిని సెలెక్టు చేయగా.. అందులో తాను కూడా ఉన్నానని గణేశ్ చెప్పారు. తాను ఈ స్థాయికి రావడానికి కారణమైన రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్‌కు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికుమార్



అగనంపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉమ్మడి జిల్లా కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీవోఎస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పీలా సూర్యనారాయణ (రవికుమార్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం లంకెలపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులంతా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జగదీశ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాఘవేంద్ర, ట్రెజరర్‌గా బాల రవికిరణ్, ఉపాధ్యక్షులుగా అప్పలరాజు, రాజేశ్, సంయుక్త కార్యదర్శులుగా సుశీల, కుమార్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్య వర్గాన్ని సంఘం రాష్ట్రం అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్‌బాబు, సుధాకర్, సంఘం నాయకులు రత్నకుమార్, రమేశ్‌కుమార్, పురుషోత్తంనాయుడు, కటారి ఈశ్వరరావులు అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519